# మోహాలు

సనగరం పార్థసారథి.

రైల్వేగార్డు పచ్చజెండా చూపాడు.

డ్రైవర్ వోపిక కొద్దీ డీసెల్ యింజన్ చెవులు గింగిర్లు పోయేట్లు కూతవేసింది. బయలు దేరడానికి సిద్ధంగా వున్నానన్నట్లు.

మూర్తి వులిక్కిపడి, కంపార్టుమెంటు కిటికీ చూచల్ని పట్టుకొన్న భార్య చేతిని మృదువుగా గట్టిగా పట్టుకొన్నాడు.

పరీక్ష గదిలో టైమయిందని వాచర్ తొందర పెడుతూంటే యింకా పది పేజీలు వ్రాయాలని తికమక పడిపోయి ఏమీ వ్రాయలేని విద్యార్థిలా, పుట్టింటికి వెడుతున్న భార్యతో ఏమేమో చెప్పాలనుకొని ఏమీ చెప్పలేక భార్య చేతిని మృదువుగా నిమురసాగాడు.

తాపానికి, అనుతాపానికి, విరహాలకు సరసాలకు అతీతమయినట్లు రైలు మరో కూతతో కదిలింది.

తప్పదన్నట్లు మూర్తి వెనక్కి జరిగి చేతిని చూపాడు. బదులుగా భార్య చిరునవ్వును బరువుగా అందుకుని హృదయంలో దాచుకుని తన యింటికి వచ్చేశాడు.

తాళంతీసి లోనికెళ్ళేసరికి యిల్లుబోసి పోయినట్లు వుంది. వసంతాన్ని పోగొట్టుకున్న వనంలా వుంది.

భార్యను విడచి కనీసం ఆరు నెల లయినా విరహంలో బ్రతకాలని గుర్తు కొచ్చేసరికి మనస్సు బావురుమంది మూర్తికి. పట్టెమంచం మీద పరచిన పరుపు పరచినట్లుగా వుంది.

ఏమీ తోచక పడుకున్నాడు మూర్తి నిద్రయినాపోదామని.

అదుపులేని కోతిలాంటిది మనస్సు. మనస్సులో చెలరేగే గదబిడలు మూర్తికి భార్య ఎడబాటును భరించ లేనిదిగా చేస్తున్నాయి. నిద్రపట్టడం లేదు బలవంతంగా కళ్ళు మూసుకున్నా మూర్తికి.

కళ్ళంలేని మనస్సుకు, కళ్ళులేని ఆలోచనలకు స్నేహం. మనస్సుతో పాటే ఆలోచనలుకూడా గంతులు వేస్తుంటాయి.

మూర్తికి పెళ్ళయి సంవత్సరం దాటింది. పెళ్ళయిన కొత్తలో ఎఫ్.పీ. కనీసం మూడేళ్ళయినా పాటిస్తే ఎంతో హాయిగా వుంటుందనుకున్నాడు. కానీ భార్య ప్రక్కన వుందన్న సంతోషంలో, ఆ హాయిలో ఎఫ్.పీ. సంగతే మరచి పోయాడు. ఫలితంగా భార్యను పుట్టింటికి పంపక తప్పలేదు.

భార్య ప్రక్కన లేకపోయేసరికి ఎఫ్.పీ. సంగతి గుర్తుకొచ్చి తన మంద మతికి తనే నొచ్చుకున్నాడు.

భార్యను గురించి ఆలోచించే కొద్దీ మనస్సు వేడెక్కిపోతుంటే కోర్కెలు రగులుకుంటున్నాయి.

పరుపుమీద యిటు అటు దొర్లాడు ఏంతోచక. ఏమయినా చదువుదామనుకుని టేబిల్‌మీద వున్న నవల తీసుకో

పోయాడు. టేబిల్‌మీద వున్న ఫోటో కన్పించింది.

ఆ ఫోటోలో వున్న ఆమె రమణరావు భార్య. రమణరావు తన కొలీగ్. నెలక్రితం తనున్న ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయివచ్చాడు. తనే అతనికి అద్దె యిల్లు చూసిపెట్టాడు.

రమణరావుకు పదేళ్ళ కూతురుంది. తనువాళ్ళ యింటికి తరచుగా వెళ్ళేవాడు. తను వెళ్ళినపుడల్లా "మామయ్యా" అంటూ తన దగ్గరే వుండేది ఎంతో చనువుగా.

రమణరావు పరిచయమయిన కొత్తలో చెప్పాడు. విధి తన భార్యను తనకు దూరం చేసిందని. ఆ షాక్‌నుండి తేరుకోవాలనే తను వూర్లు మారుతున్నానని చెప్పాడు.

రమణరావు వేదాంతిలా వుంటాడు. తన కూతురు రోజాకోసమే జీవిస్తున్నానంటాడు. మరో పెళ్ళి చేసుకోవడానికి విధితనను మళ్ళీ మోసం చేస్తాదేమోనని భయమట. అందువలన మళ్ళీ పెళ్ళిఇష్టం లేదన్నాడు.

మూర్తికి రమణరావును గురించి ఆలోచించేకొద్దీ మనస్సు ద్రవించిపోతుంది.

రెండు రోజుల క్రితం తను రమణరావు యింటికి వెళ్ళేసరికి రోజాఏడుస్తా వుంది. రమణరావు విసుగ్గావున్నాడు. తనను చూస్తూనే రోజా పరుగెత్తుకొచ్చింది.

"మామయ్యా, అమ్మ ఫోటోకు అద్దం కట్టించుకురమ్మంటే నాన్న వద్దంటున్నాడు" అంది ఏడుస్తూ.

తను ప్రశ్నార్థకంగా రమణరావు వైపు చూశాడు.

"వద్దులే మూర్తీ, ఆ ఫోటో మరుగున పడి వుండడమే మంచిది. అది కనిపిస్తే గతం గుర్తుకొచ్చి నన్ను విలువునా దహించి వేస్తుంది" అన్నాడు రమణరావు.

అతని మాటల్లో బాధ గూడు కట్టుకొని ధ్వనించింది. అది భార్యావియోగం వల్ల వుండొచ్చుననుకున్నాడు తను.

తరువాత రోజాను బుజ్జగిస్తూ, "మీ అమ్మ ఫోటోకు నేను అద్దం కట్టించి తెస్తానుగా" అని ఫోటో తీసుకున్నాడు తను.

తన భార్య ప్రయాణ సన్నాహంలో ఫోటో సంగతే మరచిపోయాడు మూర్తి.

ఫొటోను న్యూస్ పేపరులో చుట్టి రమణారావు యింటికి వెళ్ళాడు. రమణారావు యింట్లోలేడు. రోజా మాత్రం వుంది. బిక్కు బిక్కుమంటూ.

రోజా తల్లి ఫోటోను చూసేసరికి సంబరపడిపోయింది.

రమణారావు వస్తాడని ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఎంతసేపటికి రాకపోయేసరికి రోజాకు చెప్పి బయలుదేరాడు.

మూర్తికి ఏమీ తోచక రోడ్లు సర్వే చేయసాగాడు. ఇంటికి వెంటనే వెళ్లాలనిపించలేదు. వెళ్తే భార్య గుర్తుకురావడం తనలో కోరికలు చెలరేగడం ఖాయం. ఎన్నడూలేంది తనకివ్వాళ అలాగుంది.

ఎనిమిది గంటలకు హోటల్లో భోజనంచేసి యింటికి వెళ్తే సరిపోతుందనుకున్నాడు.

అని అనుకుంటూ వాచీ చూసు కున్నాడు. టైం ఆరుకావడానికి యింకా అయిదు నిమిషాలుంది. ఎనిమిదిగంటల వరకు తను వీధులు సర్వే చేయాల్సిం దేనా అని ఆలోచనలో పడ్డాడు.

ఎదురుగా గోడకు యింగ్లీషు సినిమా వాల్ పోస్టరు కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఆ సినిమా ఖచ్చితంగా పెద్దలకు మాత్రమే అని చదవగానే సినిమా చూడాలనిపించింది. మనస్సు ఎంతగానో ఉద్రేకపడింది.

గబగబ థియేటర్ వద్దకు వెళ్లాడు. అప్పుడే అన్ని తరగతులవద్ద తన సోదరులు పెద్ద క్యూలుగా తయారయి వున్నారు. ఫస్టుక్లాసు క్యూలో నిల బడ్డాడు మూర్తి.

నిమిష నిమిషానికి వాచీ చూసుకుంటు న్నాడు. తనకు టికెట్టు దొరుకుతుందో లేదో ననుకుంటూ దిగులు పడ్డాడు. ఎదురుగా వాల్‌పోస్టరులో హీరోయిన్ వీపు భాగమంతా నగ్నంగా వుంది. క్షణాలు గడిచేకొద్దీ బ్లాకులోనైనా టికట్ కొని వెళ్ళితీరాల్సిందే ననుకున్నాడు.

తన ఆలోచనలు ఒక లైనులో పడే సరికి బుక్కింగ్ కౌంటర్‌వద్ద నిలుచున్న వారిలో రెండవవాడు మూర్తి. పర్సుతీసి అయిదు రూపాయలనోటు తీశాడు. ముందునిలుచున్న వ్యక్తి వెళ్ళిపోగానే ముందుకు జరిగాడు కౌంటర్ మీద చేయి పెడుతూ.

"సారిసర్ ! బుకింగ్ క్లోజ్," అని కౌంటర్ వేసేశాడు క్లర్క్.

ఉత్సాహం చల్లారిపోయింది. ఎంతో ఆగా అర్ధగంటకు పైగా నిలబడిన తనపై నిప్పులవర్షం కురిసినట్టయింది.

నిరుత్సాహంగా వెనక్కు దిరిగాడు. మెయిన్‌గేటువద్ద ఎవరో బ్లాకులో టికట్లు అమ్ముతున్నట్టు కనిపించింది. అక్కడికి వెళ్లాడు పరుగులమీద. టిక్కట్లు బ్లాకులో అమ్ముతున్నతను వున్నవన్నీ అమ్మేసి వెళ్ళిపోయాడు. మూర్తికి అందరిమీద కోపం వచ్చింది. దేశం మీదకూడా పెద్దగా కోపమొచ్చింది. కానీ ఏం చేయ లేక కోపంగానే వాల్‌పోస్టరు పైపు చూస్తూ నిలబడ్డాడు.

చూస్తున్నకొద్దీ అతనిలో కోరికలు కూడా కోపంగానే వున్నాయి. ఇక అక్కడ నిలబడలేక అక్కడనుండి కదిలాడు.

కొంతదూరం వెళ్ళేసరికి రహమాన్ కనిపించాడు. అతనుకూడా తన కొలీగే. అతన్ని తప్పించుకు పోవాలనుకున్నాడు. అతను అమ్మాయిల్ని గురించి, వారితో తన అనుభవాలు చెప్పడం తప్ప మరొక విషయం మాట్లాడడు. అతని మాటలు మండిపోతున్న తన కోర్కెలను మరింత మండిస్తాయని భయపడ్డాడు మూర్తి.

అతన్ని తప్పించుకొని పోవాలను కున్న మూర్తిని రహమానే పట్టు కున్నాడు.

"ఏంగురూ ! సాయంకాలం కూడా యిల్లు వదలి వచ్చేవాడివికావు. ఇప్పు డిక్కడ సర్వేచేస్తూ తిరుగుతున్నా వంటే, నీ మిసెస్ వూరువెళ్లారా ?" అడిగాడు రహమాన్.

'అవున'న్నట్టు తలవూపాడు మూర్తి.

"అందుకే వేడెక్కిపోయి తిరుగు




తున్నావు. ఆ హోటల్‌లో కాఫీతాగి మాట్లాడుకుందాం, రాగురూ!" అన్నాడు రహమాన్ హోటల్ వైపు దారితీస్తూ.

కాఫీ త్రాగుతూ రహమాన్ అడిగాడు, "అడల్టు పిక్చరుకు బ్లాకులోకూడా టికట్టు దొరకలేదు కదూ!" ఆశ్చర్యపోయాడు మూర్తి ఆ మాటలు విని.

"ఆశ్చర్యపడకు, గురూ! నాకెలా తెలిసిపోయిందా అనా! సింపిల్ లాజిక్! నాలాంటి వాడయితే అమ్మాయి దగ్గరకే వెళ్తాడు. నీలాంటివాడు అడల్టు సినిమాకు వెడతాడు" నవ్వాడు రహమాన్.

మూర్తి అతని లాజిక్కుకు ఆశ్చర్యపోయాడు మరోసారి

"గురూ! అలాంటి సినిమాలు చూడ్డం దేనికి మరింత కాలిపోవడానికి."

మూర్తి అచేతనంగా వింటున్నాడు.

"నామాట విను. నేను ఒక అడ్రస్ చెప్తా. అక్కడికి వెళ్ళు. నిన్ననే మద్రాసునుండి వచ్చింది. ఫామిలీలైఫ్. నీ ఆరోగ్యానికేమీ భంగంలేదు. కాక పోతే కొంచం కాస్ట్లీ."

రహమాన్ మాటలు వింటున్నకొద్దీ కాలిపోతున్నాడు మూర్తి.

పెళ్ళికి ముందుకాని, ఆ తర్వాతగాని తనెప్పుడూ యిటువంటి పరిస్థితుల్లో పడలేదు. తొలిసారి భార్యా వియోగంలో తగుల్కొన్నాడు. తనెందుకో పిచ్చిగా నరాల బాధతో కాలిపోతున్నాడు.

రహమాన్‌ను ఆమె అడ్రస్సు అడగాలని వుందిగాని బెరుగ్గావుంది మూర్తికి. ఏలా అడగాలో, అక్కడికి ఏలా వెళ్లాలో, ఆమెతో ఏలా మాట్లాడాలో ఆలోచించేకొద్దీ వింతలోకంలోకి జారిపోతున్నట్టుగా వుంది మూర్తికి.

రహమాన్‌కు లాజిక్కే కాదు, ఎదుటి వ్యక్తి మనస్సు చదవగల మాజిక్కుకూడా తెలుసు.

"మూర్తీ! డోంట్ హైడ్ ఎనీథింగ్ ఫ్రమ్మీ. ఆమె ఎవరో, ఏలావుంటుందో

అని కదా ఆలోచిస్తున్నావ్. సీరియస్‌గా ఆలోచించవద్దు. స్వంతయింటికి వెళ్ళినట్లు సాదాసీదాగా కాజువల్‌గా వెళ్లు.... నో ట్రబుల్...." అని ఆమె అడ్రసు చెప్పాడు రహమాన్.

"ఇప్పుడు ఎనిమిది కావస్తోంది. మీల్సుచేసి సరాసరి అక్కడికి వెళ్లు. ఈలోగా నేను వెళ్ళి, నువ్వు వస్తావని చెప్పి కొంత శ్రమ తగ్గించి వస్తాను.

ఓ.కే....గుడ్ లక్" అని వెళ్ళిపోయాడు రహమాన్.

మూర్తి హోటల్‌నుండి యింటికి వెళ్లాడు. మనస్సంతా వికలంగావుంది. గందరగోళంగావుంది. తీయగావుంది. చేదుగావుంది. క్రొత్త అనుభవంగావుంది. అసహ్యంగావుంది.

ఆలోచనలు మరల్చుకొనే నెపంతో భోజనం చేద్దామని వంటింట్లోకి వెళ్లాడు.

భార్య వెళ్లేటప్పుడు చెప్పింది సాధ్యమైనంతవరకు యింటిభోజనం చేయమని.

పాత్రలపై మూతతీసి అన్నం చూశాడు. చల్లగావుంది. అసలే చలిగా వుంది. చల్లబడిన అన్నం తినాలంటే యిష్టంలేకపోయింది. మూత ఆలాగే మూసేశాడు.

హోటల్‌కని బయలుదేరాడు. హోటల్‌లో కూడా రద్దీగావుంది. ఒక్క టేబిల్ కూడా ఖాళీగాలేదు. కొంతసేపు హోటల్ కాంపౌండులోవున్న బుక్‌స్టాల్ వద్ద నిలబడ్డాడు. వివిధ రకాలైన పుస్తకాలున్నాయి.

మూర్తిదృష్టి వ్రేలాడదీసిన పుస్తకాలపై పడింది. అన్నీ సెక్సు పుస్తకాలే. వాటిపై కవ్వించే బొమ్మలు. వాటిని చూడగానే రహమాన్ చెప్పిన ఆమెపై ఆలోచనపోయింది.

అంతలో హోటల్‌నుండి జనం రాసాగారు.

మూర్తి భోంచేద్దామని గబగబ లోనికి వెళ్ళాడు.

భోజనం చేస్తున్నపుడు ఆమె కనిపించసాగింది విస్తట్లో. మనస్సు బలంగా యీడ్చసాగింది.

ఏదో విధంగా భోజనం అయిందనిపించి కిళ్ళీవేసుకొని వెలుపలికి వచ్చాడు మూర్తి.

రహమాన్ చెప్పిన అడ్రసు. అడ్రసులోవున్న ఆమె మనస్సు బలంగా లాగుతున్నాయి.

ఒక్కసారి గట్టిగా ఆలోచించి, ఆమె అడ్రసుకోసం వెళ్ళాడు.

వెళ్ళగానే ఆమె తన కోసమే ఎదురు చూస్తున్నట్టుగా చిరునవ్వుతో ఆహ్వానించింది.

మూర్తికి ఆమెనుచూస్తే అసహ్యమనిపించలేదు. ఈలాంటి వారంతా అదోలా వుంటారని వూహించుకొనేవాడు. కానీ యీమె అందని మ్రానిపండు కాకపోయినా అందరి చేతుల్లో నలగని దనిపించింది.

మూర్తి ఆమె చిరునవ్వుకు రెస్పాన్స్ యివ్వాలన్న సంగతి మరచిపోయాడు కొత్తదనంలో కలిగిన భయంతో మౌనంగా వెళ్ళి ఆమె చూపిన కుర్చీలో కూర్చున్నాడు.

ఆ గది చుట్టూరా చూశాడు. మరులు కొల్పేటట్టు వివిధ భంగిమలలో సుందరీ

మణుల అర్ధనగ్న ఫోటోలున్నాయి. మూర్తి కూర్చొన్న కుర్చీకి ఎదురుగా పట్టెమంచంమీద డన్‌లప్ డబుల్‌బెడ్, దానిమీద పరచిన అందమైన బెడ్‌షీట్ మూర్తిని వివశుణ్ణి చేస్తున్నాయి. పైగా ఎదురుగా ఆమె బెడ్‌పై కూర్చొంది.

సినిమాలోని రసికునిలా ఆమె పైబడి రక్కి తన రసికత్వాన్ని చెప్పాలని వుంది. కాని భయంతో బిగుసుకు పోయాడు. అంతరంగంలో భావాలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నా పెదవిదాటి బయటకు రాలేకపోయాయి. కనీసం చిరునవ్వు కూడా నవ్వలేక పోయాడు.

ఆమె కళ్ళతో పల్కరించింది అతన్ని పలకరింపజేయాలని. ఒళ్ళు విరచుకొని మత్తుగా ఆవలించింది అతన్ని చేతనుణ్ణి చేయాలని.

మూర్తిచూపు ఆమె మీదే వున్నా అతను చీకట్లో కూర్చొని వున్నట్లు న్నాడు. అతని మెదడుపై నరాలు బలంగా ఎగురు తిరుగుతున్నాయి కోర్కెలు నిండిపోయి.

"మూర్తిగారూ, మీ శ్రీమతి గారిని పుట్టింటికి పంపారని రహమాన్ అన్నాడు." అతని బిడియాన్ని పలక రించి పోగొట్టాలనుకుంది ఆమె. ఆమె పలకరింపుతో తేరుకున్నా మాట్లాడ్డానికి అతని గొంతుక ఎండిపోయింది.

"నా పేరు మాయ.... పేరు చిత్రంగా వుందికదూ! ఇక్కడికి వచ్చిన వారు వున్నంతసేపు అతి చనువుగా వుంటారు. అపేక్షలు కురిపిస్తారు. తరువాత వెళ్ళిపోతారు మాయమయినట్టుగా.... అందుకే నాపేరు మాయ అనిఅన్నాను."

చిత్రంగాచూస్తున్నాడు మూర్తి గర్భ గుడిలో కూర్చొన్న దేవుడిలా మూగగా.

"మీరు మీకిష్టమయిన పేరుతో పిల వ్వచ్చు. నాకభ్యంతరం లేదు."

విచిత్రంగా నవ్వింది మాయ.

మూర్తి లోలోపలే ఆమెను పిలి చాడు. ఆమెకు వినిపించలేదు.

"మీరు మాట్లాడరా....మీరు చేతల వారేనేమో." ఆమె నవ్వు మూర్తికి సూదులు గుచ్చుకున్నట్లు లేదు. మల్లెలు రువ్వినట్టు హాయిగా వుంది.

ఎన్నో మాట్లాడాలని వుంది మూర్తికి రహమాన్ ఎన్నో చెప్పాడు. కానీ అతని కవేవీ గుర్తురావడం లేదు. అతని గొంతు భయంకరంగా మూగదయి పోయింది.

"నేను స్నానంచేసి వస్తాను. అంత వరకు యీఆల్బమ్ చూస్తూ వుండండి." అలమారునుండి అల్బమ్ తీసి యిచ్చి. వయ్యారంగా నడుస్తూ ఆ గదికి అటాచ్ డుగా వున్న బాత్‌రూంలోకి వెళ్ళింది.

వెళ్తూ వెనుదిరిగి చూసి మళ్ళీ నవ్వింది.

ఆ చిరునవ్వుకు జవాబుగా తనను రమ్మన్నట్టు, వెళ్ళి ఆమెను తన బాహు వుల్లోకి యిముడ్చుకోవాలని అనిపించింది మూర్తికి.

ఆమె బాత్‌రూం తలుపు వారగా వేసి స్నానం చేస్తుంది.

బాత్ రూం నుండి వస్తున్న నీటి శబ్దం మూర్తికి మనస్సులో కురుస్తున్న మంచు సొనలావుంది.

ఆమె బాత్‌రూంనుండి రాగానే ఆమెను అలాగే అందుకోవాలను

కున్నాడు ఆల్బమ్ పేజీలు త్రిప్పుతూ. అన్నీ వివిధ దేశాలకు చెందిన ఫోటోలు నగ్నంగా వుండగా తీసినవే.

వాటిని చూస్తున్నకొద్దీ, అందు మాయ ఫోటో చూడాలని ఆత్రంగా వుంది మూర్తికి. గబగబ పేజీలు త్రిప్ప సాగాడు.

అతని దృష్టి ఒక ఫోటోవద్ద ఆగి పోయింది. అది మిగతా వాటికి భిన్నంగా ఉంది. నుదుట కుంకుమ, కళ్ళకు కాటుక సిగలో పూలు సనాతన కుటుంబ స్త్రీ ఫోటోలా వుంది. ఆశ్చర్యంతో పరీక్షగా చూశాడు మూర్తి.

ఈలాంటి ఫోటో ఎక్కడో చూసి నట్టుగా ఫీలయ్యాడు మూర్తి. తనెక్కడ చూశాడో ఎంత ఆలోచించినా గుర్తు రావడంలేదు.

అతను ఆలోచనల నుండి తేరుకోక ముందే మాయ స్నానంచేసి వచ్చింది.

ఆమె రాక అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది. అతను తల పైకెత్తి ఆమెను చూశాడు. ఆమె నవ్వుతూ వుంది. ఆమె కళ్ళు నవ్వుతూ వున్నాయి. ఆమె గొంతుమీద కుడి పైపుగా వున్న నల్లటి పుట్టుమచ్చ నవ్వుతూ వున్నట్టుగా వుంది మూర్తికి.

ఫోటోవైపు ఒకసారి, ఆమెవైపు ఒకసారి ఉద్రేకంగా చూశాడు.

ఆమె నవ్వుతూ నిలువుటద్దం ముందు కూర్చుంది.

"ఆ ఫోటో నాదే. పూర్వాశ్రమంలో తీసినది. దాదాపు పది సంవత్సరాలయి నది" మేకప్ చేసుకుంటూ అంది.

మూర్తి ఆమె చెప్పింది వింటూ మళ్ళీ ఆలోచనల్లో పడిపోయాడు. అతను కూర్చున్న చోటునుండి కదలక పోయేసరికి మాయకు ఆశ్చర్యమేసింది. కారణం తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది.

అతన్ని రెచ్చగొట్టాలనుకుంది. తన కెన్నో మార్గాలు తెలుసు. తనీ పది సంవత్సరాల్లో ఎందరోన్నె రెచ్చగొట్టింది. తనదగ్గరకొచ్చిన వాళ్ళలో పది సంవత్సరాల్లో యీలాంటి వ్యక్తి యితనే అని అనుకుంది మాయ.

మేకప్ చేసుకుంటూ పైట జార్చింది మాయ. అతను చూచి ఏలా ఫీలయ్యాడో నని వోరకంట చూసింది.


అతను కళ్ళు మూసుకున్నాడు. అతని ముఖంలో ఏదో బాధ వ్యక్తమవుతోంది. మాయకు అతన్ని చూసేకొద్దీ ఆశ్చర్యం ఎక్కువవుతోంది.

ఇంతసేపు తన్నింత విశ్రాంతిగా వుండనిచ్చినవారు యీయన తప్ప మరొకరు లేరు. కానీ తను ఆయనవద్ద పుచ్చుకొన్న డబ్బుకు తగినసుఖం అందీయడమే తన డ్యూటి. అందుకు తనే కల్పించు కోవాలి.

అని అనుకుంటూ బెడ్‌మీద వయ్యారంగా కూర్చుంది.

"మూర్తిగారూ, యీలా వచ్చి నా ప్రక్కగా కూర్చోరాదూ!", ఆమె పలుకుల్లోని గమ్మత్తు మునుపటిలా మత్తుగా లేదు. అసహ్యంగా వుంది. ముఖం చిట్లించుకున్నాడు మూర్తి.

అతని మనస్సులోని బాధ ఆమెకు అర్థం కాలేదు.




"మీకు మీ భార్య పై మనస్సు పోయిందా? ఇక్కడికొచ్చిన తరువాత యింటి విషయాలు కొంతసేపయినా మరచిపోగలిగితేనే సుఖం పొంద గలరు."

ఆమె మాటలు తనను ముళ్ళపై విసరినట్టువుంది మూర్తికి.

"ముట్టుకుంటే ముడుచుకపోయే తీగ లాంటి మీరు యిక్కడకు ఎందుకు వచ్చారో అర్థం కాకుండా వుంది.... మీరు కాక మీ స్థానంలో మరొకరు వుంటే నన్నిలా వుండనిచ్చేవారా? నన్ను బాత్ రూంలో స్నానం చేయనిచ్చేవారా? ఈ చీరను నామీద యిలా వుండనిచ్చే వారా?....యిలా తీసి నా కందకుండా ఆ మూల పారవేసేవారు" అని చుట్టుకున్న చీరను లాగి అవతల పారేసింది మాయ.

ఆమె చేతలన్నీ మూర్తికి దుఃఖం కలిగిస్తున్నాయి. రాకూడని చోటికి వచ్చి నట్టుగా విలవిలలాడిపోయాడు.

"నేను మద్రాసులో వుండగా ఒకటి జరిగింది, చెప్పనా?" అని సున్నితంగా నవ్వి, "అరవై సంవత్సరాల ప్రియుడొచ్చాడు; పాపం, అతని కింకేమి అవసరంలేదు. నా ప్రక్కగా కూర్చున్నాడు. సిగరెట్టు త్రాగుతూ నాకిక్కడ కాల్చాడు. నాకప్పుడు కలిగిన బాధ అతని కెంతో ఆనందం కలిగించింది" అంటూ జాకెట్టు తొలగించి కుడిపైపు చూపింది మాయ.

అప్రయత్నంగా చూశాడు మూర్తి. అక్కడ నల్లటి మచ్చ ఏర్పడి వుంది.

"నేను మంటకు బాధ పడుతుంటే అతనక్కడ ముద్దు పెట్టాడు గట్టిగా. మందు వేయించుకొమ్మని వేయి రూపాయిలిచ్చి వెళ్ళిపోయాడు. అలా వుంటారు కొందరు పిచ్చోళ్ళు."

అసహనంగా వుంది మూర్తికి క్షణాలు గడిచేకొద్దీ.

"మరొక పిచ్చోడి కథ చెప్పనా...." అలవోకగా నవ్వి అంది మాయ.

ఆమె నవ్వు నిప్పులు రువ్వినట్టుగా వుంది మూర్తికి.

"ఆ పిచ్చోడు వచ్చి రాగానే...." చెప్పబోతోంది మాయ చాల మామూలు విషయమన్న ధోరణిలో.

"ఆగు, యిక చెప్పకు," గట్టిగా అరిచాడు మూర్తి.

ఆ అరుపు విని వులిక్కిపడింది మాయ. అతనివైపు చూసింది. కోపంతో వణికిపోతున్నాడు మూర్తి.

మూలగా పడివున్న చీర తెచ్చి ఆమె మీద పడేశాడు.

ఆమె అతని ప్రవర్తనకు విస్తుపోయింది. పిచ్చివాడేమోనని భయపడింది. ఆమె లేచి గబ గబ చీర చుట్టుకొంది.

"మూర్తిగారూ,...." అంది మాయ అతన్ని అర్థం చేసుకోవాలని.

"ఇదిగో నీకూలి," అని వందరూపాయలనోటు ఆమె ముఖాన విసరికొట్టాడు మూర్తి వెళ్ళబోతూ.

ఆమె నిర్విణ్ణురాలయింది. అతన్ని వెళ్ళవద్దని వారించలేకపోయింది.

అక్కడి నుండి మూర్తి రమణరావు యింటికి బయలుదేరాడు.

అప్పటికే చాల రాత్రయింది।

రమణరావుతో మాయ విషయం చెప్పాలని అనుకుంటూ వెళ్ళేసరికి, యింటి ముంగిట అక్కడ పడివున్న గాజు పెంకులు, చినిగిన ఫోటో ముక్కలు కనిపించాయి మూర్తికి.

ఆ ఫోటో సాయంకాలం తను అద్దం కట్టించి తెచ్చినదే।

ఏం జరిగిందోనని ఆందోళనగా ముందుకు వెళ్ళి చూసేసరికి యిల్లు తాళం వేసివుంది.

ఒక్కక్షణం ఆలోచనా రహితంగా వుండిపోయాడు మూర్తి.

బరువెక్కిన మనస్సుతో తన యిల్లు చేరి తలుపు తీశాడు. తలుపు సందులోంచి, మడచిన కాగితం కిందపడింది.

మూర్తి ఆశ్చర్యపోతూ ఆ కాగితం తీసి చదివాడు. ఆ వుత్తరం రమణరావు వ్రాసినదే।

"సినిమా వ్యామోహంతో పారిపోయిన రోజా తల్లి 'మాయ'గా యీ వూరొచ్చింది. అందుకే నేను యీ వూరు వదలిపోతున్నాను నీతో చెప్పలేక, నా ముఖం చూపలేక. క్షమించు।"